
సాక్షి
కర్నూలు
బుధవారం । 25 । జనవరి । 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకుడు శ్రీ బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు.



నేను కచ్చితంగా ఓటేస్తా..

'నేను కచ్చితంగా ఓటేస్తా' అనే యువ నినాదంతో ఓటరు దినోత్సవాన్ని బుధవారం జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

- 8లో..



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,618.46
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 57.119
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,399

న్యూస్‌రీల్

పీహెచ్‌సీని సందర్శించిన నీతి ఆయోగ్ బృందం



108 వాహనాన్ని పరిశీలిస్తున్న నీతి ఆయోగ్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సుమన్ అరోరా

తుగ్గలి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఢిల్లీ నీతి ఆయోగ్ బృందం పరిశీలించింది. బృందం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సుమన్ ఆరోరా, నీతి ఆయోగ్ కన్సల్టెంట్ తేజసి మిశ్రా, శ్రేష్ఠహజ్రా, స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ సుబ్రమణ్యం తదితరులు ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, టెలిమెడిసిన్, వాక్సినేషన్, మెడికల్ యాప్‌ల పనితీరు, 108 అంబులెన్స్ సేవలపై ఆరా తీశారు. రికార్డులు, మందులు పరిశీలించారు. ఆస్పత్రిలో ఏమేమి అవసరమో వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వారి వెంట డీఎంఅండ్‌హెచ్‌వో రామగిడ్డయ్య, మలేరియా అధికారి నూకరాజు, డీపీఓ విజయరాజు, డీపీఎంవో ఉమ, స్థానిక వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఏపీ సీఎం కప్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 25 నుంచి ఏపీ సీఎం కప్ ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న అథ్లెటిక్స్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, 27న బాల్ బాడ్మింటన్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, హాకీ, బాడ్మింటన్, 28న ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

ఈ-నామ్‌లో కర్నూలు మార్కెట్‌కు 2వ స్థానం



వ్యాపారులను సత్కరిస్తున్న చైర్మన్, సెక్రటరీ తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ ఎలక్ట్రానిక్ వ్యవసాయ మార్కెటింగ్ (ఈ-నామ్) అమలులో కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ దేశంలోనే 2వ స్థానంలో నిలవడం అభినందనీయమని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు కారణమైన వ్యాపారుల(ట్రేడర్స్)ను మార్కెట్ కమిటీ ఎంపిక శ్రేణి సెక్రటరీ గోవిందుతో కలసి ఘనంగా సత్కరించారు. మంగళవారం తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఉల్లి గడ్డలతో సహా అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులను ఈ-నామ్ టెండర్ల ద్వారానే కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులకు ఈ-నామ్ తక్‌పట్టీలనే ఇస్తుండటం వల్ల క్రయవిక్రయాల్లో పారదర్శకత పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీలు రహిమాన్, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు సీఐలకు స్థానచలనం

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలో నలుగురు సీఐలకు స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు అర్బన్ తాలూకా పీఎస్‌లో పనిచేస్తున్న రామలింగమయ్యను అక్కడే రెగ్యులర్‌గా నియమించారు. అలాగే త్రీటౌన్ పీఎస్‌లో పనిచేస్తున్న కుంచల శ్రీనివాసులును మంత్రాలయం సర్కిల్‌కు, అక్కడున్న వి.భాస్కర్‌ను వీఆర్ కర్నూలుకు, వీఆర్‌లో ఉన్న యు.లక్ష్మయ్యను దిశ పీఎస్‌కు నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బనగానపల్లె నియోజకవర్గానికి చేనేత క్లస్టర్

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల జిల్లాలోని బనగానపల్లెకు చేనేత క్లస్టర్ మంజూరైనట్లు జిల్లా చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు హరికృష్ణ మంగళవారం తెలిపారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో కర్నూలులోని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుల కార్యాలయాన్ని విభజించలేదని, ఈ కార్యాలయం ఉమ్మడిగానే పనిచేస్తోందన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో చేనేత క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా ఆమోదం లభించిందన్నారు. రూ.1.11 కోట్లతో క్లస్టర్ ఏర్పాటు చేయనున్నారు. నందివర్గం, ఐ.కొత్తపేట, పలుకూరు తదితర గ్రామాల్లోని 97 మంది చేనేత కార్మికులకు కోరుకున్న అధునాతన మగ్గం పరికరాలు సబ్సిడీపై అందిస్తామన్నారు.

దశాబ్దాల సమస్యకు దారి చూపిన జగన్

- వంతెన నిర్మాణ భూమి పూజలో ఎంపీ సంజీవ్ కుమార్
- హాజరైన మంత్రి బుగ్గన, ఎమ్మెల్యేలు సుధాకర్, శ్రీదేవి, కాటసాని, జిల్లా నేతలు





శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు తదితరులు, బహిరంగ సభకు హాజరైన ప్రజలు

సి.బెళగల్: కోడుమూరు, కృష్ణగిరి మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు 70 ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యకు దారి చూపిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. మంగళవారం కోడుమూరు మండలం గోరంట్ల గ్రామం వద్ద హంద్రీ నదిపై వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు, ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, పాణ్యం, పత్తికొండ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కంగాటి శ్రీదేవి, కుడా చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి తదితరులు హాజరయ్యారు. హంద్రీ ఒడ్డున భూమిపూజ చేసి శిలా ఫలకాన్ని వీరు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఎంపీ మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 24 కోట్లు మంజూరు చేయడంతో పలు గ్రామాల ప్రజల కష్టాలు తొలగిపోతున్నాయన్నారు. పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుందామన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంత ప్రజల కష్టాలు చూసి చలించి, అధికారంలోకి వస్తే వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చారన్నారు. కృష్ణగిరి, కోడుమూరు ప్రజలు ఎప్పటికీ జగనన్న మేలు మరువరన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రజల వద్దకు పంపుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శమన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న టీడీపీ నేతలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు.

ఎమ్మెల్యే 8 కి.మీ పాదయాత్ర



ఎంపీ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యే సుధాకర్, మేయర్ బీవై రామయ్యను సత్కరిస్తున్న ప్రజలు

తన నియోజకవర్గ పరిధిలో ఏళ్ల నాటి సమస్య పరిష్కారం అవుతుండటంతో కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ప్రజలతో అమడగుంట్ల గ్రామం నుంచి 8 కి.మీ. మేర గోరంట్ల గ్రామానికి పాదయాత్రగా చేరుకున్నారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణ పడి ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు మల్కిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు అమడగుంట్ల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథరెడ్డి, గిరిజోను, ఎంపీపీలు బొంతల మునెప్ప, స్థానిక సర్పంచ్ బాలకృష్ణ, ఎంపీటీసీలు మస్తాన్, రవి తదితరులు పాల్గొన్నారు.

భూగర్భం జలహో!

2022 మే నెలతో పోలిస్తే డిసెంబరులో భూగర్భ జలాలు (మీటర్లలో) ఇలా ..		
మండలం	2022 మే	2022 డిసెంబరు
ఆదోని	6.98	4.88
ఆలూరు	5.29	3.48
ఆస్పరి	11.35	6.68
సి.బెళగల్	2.96	2.03
చిప్పగిరి	3.15	1.88
దేవనకొండ	7.35	4.52
గోనెగండ్ల	9.21	4.75
గూడూరు	8.2	6.80
హాలహర్వి	3.75	2.85
హొళగుంద	5.72	3.23
కల్లూరు	10.41	6.72
కోడుమూరు	6.85	4.86
కోసిగి	40.82	16.45
కౌతాళం	9.5	5.02
కృష్ణగిరి	3.85	2.40
కర్నూలు	7.02	4.03
మద్దికెర	14.52	9.70
మంత్రాలయం	7.37	6.58
నందవరం	5.55	2.65
ఓర్వకల్లు	16.42	10.64
పత్తికొండ	5.05	4.38
పెద్దకడబూరు	2.45	1.40
తుగ్గలి	8.22	5.52
వెల్దుర్తి	5.34	4.30
ఎమ్మిగనూరు	12.17	9.85
జిల్లా సగటు	8.78	5.42



తుగ్గలి మండలం రాతనలో బోరు నుంచి ఉబికి వస్తున్న భూగర్భ జలాలు

ఒకప్పుడు బోరు వేయాలంటే వందల అడుగులు తవ్వాల్సి వచ్చేది. అయినా చుక్క నీరు కూడా కనిపించేది కాదు. పదుల సంఖ్యలో బోర్లు వేస్తూ రైతులు అప్పుల పాలయ్యేవారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు, సాగునీటి వనరులు అంతంత మాత్రంగా ఉండడం..తదితర కారణాలతో భూగర్భజలాలపై అన్నదాతలు నమ్మకం పెట్టుకునే వారు కాదు. అయితే మూడేళ్లుగా ఈ పరిస్థితుల్లో పూర్తి మార్పు వచ్చింది. వర్షాలు సమృద్ధిగా కురవడం, నదులు, కాలువలు నిండుగా ప్రవహించడం, చెరువులు నిండడంతో భూగర్భజలాలు పైపైనే దొరుకుతున్నాయి. 'జల'హో అంటూ బోర్ల నుంచి గంగమ్మ పైకి ఉబికి వస్తూ రైతుల మోముల్లో ఆనందం నింపుతోంది.

జిల్లాలో పైపైకి వస్తున్న పాతాళగంగ

- గార్గేయపురంలో 0.59 మీటర్లలోనే అందుబాటులోకి
- 14 అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో పరిస్థితి ఆశాజనకం
- సమృద్ధిగా కురిసిన వర్షాలతో పెరిగిన భూగర్భజలాలు
- వ్యవసాయ బోర్లపై తొలగనున్న నిషేధం

సమృద్ధిగా నీళ్లు



మాది కరువు ప్రాంతం. వర్షాధారం వ్యవసాయంతో ఎప్పుడూ నష్టాలే. మా మండలం మీదుగా హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ పోవడం, కాల్వలో ఏడాదిలో ఎక్కువ నెలలు నీరు ఉండటం, వర్షాలు మూడేళ్లుగా విస్తారంగా కురుస్తుండటంతో బోర్లలో నీళ్లు బాగా పడుతున్నాయి. ఇటీవల వైఎస్సార్ జల కళ కింద మా పొలంలోనూ బోరు వేశారు. నీరు పుష్కలంగా వచ్చింది. మా కష్టాలన్నీ తొలగిపోయాయి. గతంలో ఉపాధి కోసం వలస వెళ్లే వాళ్లు కూడా ఇప్పుడు ఊళ్లలోనే వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు.–రాము నాయక్, బాటతండా, తుగ్గలి మండలం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉన్నాయి. 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఏటా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. అన్ని ప్రాంతాల్లోని చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. అంతేగాక సాగునీటి ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉంటోంది. హంద్రీ-నీవా సుజల స్రవంతి, తుంగభద్ర దిగువ, కేసీ కాలువలు నిండుగా ప్రవహిస్తున్నాయి. ఫలితంగా భూగర్భ జలాలు పైపైనే లభిస్తున్నాయి. రానున్నది వేసవి కాలమైనా నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

5.42 మీటర్లలోనే జలం

ప్రతి నెలా భూగర్భ జలాలను సంబంధిత శాఖ అధికారులు అంచనా వేస్తారు. జిల్లాలో 63 పీజియో మీటర్లతో తీసిన లెక్కల ప్రకారం డిసెంబర్ నెలలో జిల్లా మొత్తం సగటున గ్రౌండ్ వాటర్ 5.42 మీటర్లలో ఉన్నట్లు తేలింది. 2021 డిసెంబరులో 5.82 మీటర్లలో ఉన్న జలం 2022 మే నెలలో 8.78 మీటర్లలోకి వెళ్లింది. 2022 డిసెంబరులో 5.42 మీటర్ల పైకి వచ్చింది. 2021 డిసెంబరు నెలతో పోలిస్తే 0.40 మీటర్లు, 2022 మే నెలతో పోలిస్తే 3.36 మీటర్లు పెరగడం విశేషం. జిల్లాలోని ఐదు మండలాల్లో 3 మీటర్లు, 15 మండలాల్లో 3 నుంచి 8 మీటర్లు, ఐదు మండలాల్లో 8 నుంచి 20 మీటర్లలో భూగర్భ జలాలు ఉన్నాయి. కర్నూలు మండలం గార్గేయపురంలో 0.59, హొళగుందలో 1.12 మీటర్లలో నీరు లభ్యమవుతుండటం విశేషం.

తొలగిన సమస్య

భూగర్భ జలాల వినియోగం 70 శాతం వరకు మాత్రమే ఉండాలి. అంతకు మించి ఉంటే సమస్యాత్మక ప్రాంతాలుగా పరిగణిస్తారు. 90 నుంచి 100 శాతం వరకు ఉంటే అత్యంత సమస్యాత్మకమైన గ్రామాలుగా గుర్తిస్తారు. జిల్లాలో కోసిగి మండలం మినహా అన్ని మండలాల్లో వినియోగం తక్కువగానే ఉంది. గతంలో గోనెగండ్ల 3, కోసిగి 9, ఓర్వకల్లు 1, వెల్దుర్తి మండలంలో 1 చొప్పున మొత్తం 14 గ్రామాల్లో భూగర్భ జలాలను 100 శాతం వినియోగించే వారు. దీంతో ఆయా గ్రామాలను తీవ్ర సమస్యాత్మకమైనవిగా గుర్తిస్తూ కేంద్రం నోటిఫై చేసింది. ఈ గ్రామాల్లో వ్యవసాయ బోర్లు తవ్వడం నిషేధం. ఈ గ్రామాల్లో భూగర్భ జలాలు గణనీయంగా మెరుగుపడడంతో పాటు వినియోగం తగ్గింది. ఈ మేరకు జిల్లా అధికారులు కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపారు. కేంద్రం గెజిట్ విడుదల చేసిన తర్వాత ఆయా గ్రామాలు బోర్లపై నిషేధాన్ని తొలగించనున్నారు.

5.65 టీఎంసీల వినియోగం

జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలాల లభ్యత 30.36 టీఎంసీలు ఉంది. ఇందులో 5.65 టీఎంసీ మాత్రమే వినియోగిస్తున్నారు. మొత్తం 20.70 టీఎంసీల జలాలు మిగులుగా ఉన్నాయి. వినియోగం కేవలం 18.62 శాతం మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. ఎమ్మిగనూరు 3.05, మద్దికెర 8.57, దేవనకొండ 10.26, ఆలూరు 13.85, తుగ్గలి 15.30, హాలహర్వి మండలంలో 15.10 శాతం ప్రకారం భూగర్భ జలాలు వినియోగించినట్లు తెలుస్తోంది.

మరింత జల సంరక్షణ అవసరం

వర్షపు నీరు తొమ్మిది శాతం మాత్రమే భూమిలోకి ఇంకుతోంది. మిగిలి 91 శాతం వివిధ రూపాల్లో వృథా అవుతోంది. వర్షపు నీరు వృథా కావడాన్ని అరికట్టేందుకే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జలసంరక్షణ పనులు పెద్ద ఎత్తున చేపడుతున్నారు. జలశక్తి అభియాన్ కింద వాటర్‌షెడ్ కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. జిల్లా సాధారణ వర్షపాతం 515.5 మి.మీ. ఉండగా మూడేళ్లుగా 600.7 మి.మీ. వర్షం కురుస్తోంది. జిల్లాలో కురిసిన వర్షాలతో 169 టీఎంసీ నీరు ఉత్పన్నమైంది. ఇందులో 41 శాతం నీరు ఆవిరవుతోంది. అలాగే 40 శాతం నీరు వృథాగా వెళ్లిపోతోంది. 10 శాతం నీరు భూమిలో తేమగా మారతోంది. భూగర్భ జలాల అభివృద్ధికి జలసంరక్షణ పనులు మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది.

వినియోగం తక్కువగానే ఉంది



జిల్లాలో మూడేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు బాగా అభివృద్ధి చెందాయి. జిల్లాలో భూగర్భ జలాల వినియోగం 18.62 శాతం మాత్రమే ఉంది. ఒక్క కోసిగి మండలంలో మాత్రమే 70.91 శాతం వినియోగిస్తున్నారు. మిగిలిన అన్ని మండలాల్లో వినియోగం తక్కువగానే ఉంది.
– శ్రీనివాసరావు, డీడీ, జిల్లా భూగర్భ జల గణన శాఖ, కర్నూలు

జల సంరక్షణ పనులకు పెద్దపీట



జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద జల సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం. భూగర్భ జలాల అభివృద్ధి లక్ష్యంగా వాటర్ రీచార్జ్ స్ట్రక్చర్లు, చెక్‌డ్యామ్‌లు, డగౌటు పాండ్స్, ఫాంపాండ్స్ నిర్మిస్తున్నాం. చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌ల్లో పూడికతీత పనులు చేపడుతున్నాం. వాటర్‌షెడ్ కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నాం. కూలీలతో చేయిస్తున్న పనుల్లో భూగర్భ జలాల అభివృద్ధికి సంబంధించినవే 90 శాతంపైగా ఉంటున్నాయి. రానున్న రోజుల్లో జలసంరక్షణ పనులను మరింత పెద్ద ఎత్తున చేపట్టనున్నాం. – అమర్‌నాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

వలసలపై అధ్యయనం

- ఆరు మండలాల్లో ప్రజలతో ముఖాముఖి
- రెండు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక



కౌతాళం మండలం గోతులదొడ్డి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నుంచి వలసలు కొనసాగుతుండటంతో పలువురు జిల్లా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అధ్యయనం చేశారు. వలసలు ఎందుకు పోతున్నారు... ఏఏ ప్రాంతాలకు వెళ్తున్నారు.. అక్కడ లభించే వేతనం ఏ స్థాయిలోఉంది..? వలసలను నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై అధికారులు దృష్టి సారించారు. జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు కౌతాళం మండలంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి, కోసిగి మండలంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, మంత్రాలయం మండలంలో డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, పెద్దకడుబూరు మండలంలో డీపీఓ నాగరాజు నాయుడు, ఆదోని మండలంలో ఆదోని సబ్ కలెక్టర్ అక్షయ్ కుమార్, ఆస్పరి మండలంలో పత్తికొండ ఆర్‌డీఓ మోహన్‌దాస్‌లు మంగళవారం ఆయా మండలాలకు వెళ్లి వలసలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో నీటిపారుదల సదుపాయం లేక వ్యవసాయ పనులు డిసెంబరు నాటికే పూర్తి అవుతుండటంతో వలసలు తప్పడం లేదనే అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలుస్తోంది. ఉపాధి పనులు చేయడం వల్ల లభించే వేతనం గిట్టుబాటు కావడం లేదని, వంద రోజుల పనిదినాలు సరిపోవడం లేదని స్పష్టమవుతోంది. నీటిపారుదల సదుపాయం కల్పించడంతోనే వలసల నియంత్రణ సాధ్యమవుతుందనే అభిప్రాయం వ్యక్తమైనట్లు సమాచారం. వలసలపై అధ్యయనం చేసిన అధికారులు ఒకటి, రెండు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నారు.

జేఈఈ మెయిన్స్ ప్రారంభం

కర్నూలు కల్చరల్: జేఈఈ మెయిన్స్ తొలి విడత పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. ఐయాన్ డిజిటల్, కేవీ సుబ్బారెడ్డి ఐయాన్ డిజిటల్, బిట్స్ కళాశాలల కేంద్రాల్లో బీఈ, బీటెక్ విభాగాల్లో పేపర్-1 పరీక్ష ఉదయం, బీఆర్‌కు బి ప్లానింగ్ విభాగాల్లో పేపర్-2ఏ, 2బీ మధ్యాహ్నం జరిగింది. 1,200 మంది విద్యార్థులకు 1,020 మంది హాజరయ్యారు. పలువురు విద్యార్థులు నిర్దేశించిన సమయం కంటే ఆలస్యంగా రావడంతో పరీక్ష రాసే అవకాశం కోల్పోయారు. కొందరు విద్యార్థుల పుట్టిన తేదీల్లో తప్పులు ఉండటంతో పరీక్షకు అనుమతించ లేదు.



కర్నూలులో ఐయాన్ డిజిటల్ సెంటర్ వద్ద అభ్యర్థులు

మరో 13 పశు ఆరోగ్య సేవా రథాలు

- నేడు తాడేపల్లిలో జెండా ఊపి ప్రారంభించనున్న సీఎం
- కర్నూలు జిల్లాకు 6, నంద్యాల జిల్లాకు 7 కేటాయింపు
- 1962 కాల్ చేస్తే పశువులకు సత్వరం వైద్య సేవలు



కర్నూలు(అగ్రికల్చర్): నోరు లేని మూగజీవుల ఆరోగ్య పరిరక్షణకు డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ సేవలు మరింత విస్తరించనున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి ప్రకారం మొత్తం 14 అంబులెన్స్ సేవలు మూగజీవులకు సేవలు అందిస్తున్నాయి. వీటి సేవలను రైతులకు మరింత దగ్గర చేసేందుకు నియోజకవర్గానికి అదనంగా మరో సంచార పశు ఆరోగ్య సేవా రథాలు వస్తున్నాయి. వీటిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 25న (బుధవారం) తాడేపల్లి క్యాంపు కార్యాలయం వద్ద పచ్చ జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ నెల 26న పశు ఆరోగ్య సేవా రథాలు జిల్లాకు చేరుకుంటాయి. 108, 104 తరహాలోనే 1962కు కాల్ చేస్తే డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశువైద్య సేవ రథాలు గంట, గంటన్నర వ్యవధిలోనే గ్రామానికి చేరుకుని పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించి కాపాడుతున్నాయి. గత ఏడాది మే నెలలో నియోజక వర్గాల వారీగా మొదటి విడత వీటిని ప్రారంభించింది. వీటి ద్వారా ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 8000 మూగజీవులకు సత్వర వైద్య సేవలు అందాయి. రెండో విడత మంజూరైన 13 సంచార పశు వైద్య క్లినిక్‌లను అర్బన్ నియోజకవర్గమైన కర్నూలు మినహా ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాలకు కేటాయించారు. కర్నూలు జిల్లాకు 6, నంద్యాల జిల్లాకు 7 ప్రకారం మంజూరైన పశు ఆరోగ్య సేవా రథాలు రైతులకు అందుబాటులో ఉండేలా లొకేషన్‌లను కూడా పశుసంవర్థక శాఖ గుర్తించింది. మరో రెండు రోజుల్లో ఇవి జిల్లాకు చేరనున్నాయి.

నూతన వంగడాలతో అధిక దిగుబడులు


పప్పు శనగలో దిగుబడులను పరిశీలిస్తున్న పీఎల్ వరలక్ష్మి, శాస్త్రవేత్తలు

వెల్దుర్తి: పప్పు శనగలో నూతన వంగడాల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖాధికారి పీఎల్ వరలక్ష్మి అన్నారు. మండల కేంద్రం వెల్దుర్తితో పాటు, బొమ్మిరెడ్డిపల్లె, మల్లెపల్లె, చెరుకులపాడు గ్రామాల పరిధిలో వైఎస్సార్ పొలంబడిలో సాగు చేసిన పప్పు శనగ కోతకొచ్చాయి. మంగళవారం నంద్యాల ఆర్ఏఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్ వి. విజయలక్ష్మి, డాక్టర్ మంజనాథ్‌తో కలిసి ఆమె ఆ పంట దిగుబడులను పరిశీలించారు. ఎన్‌బీఈజీ 452, 49, 779 రకాలు మంచి దిగుబడులిచ్చినట్లు గుర్తించారు. అనంతరం చెరుకులపాడు గ్రామంలో పీఎల్ వరలక్ష్మి రైతులతో మాట్లాడుతూ రైతులు పంట సాగులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ అధిక దిగుబడులు ఇచ్చే నూతన వంగడాల సాగు వైపు మొగ్గుచూపాలని రైతులకు సూచించారు. అలాగే సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓలు శశిధర్‌రెడ్డి, అక్బర్‌బాషా ఉన్నారు.

పెళ్లంటే.. పందిళ్లు.. సందళ్లు.. తప్పెట్లు.. తాళాలు.. తలంబ్రాలు.. మూడు ముళ్లు.. ఏడు అడుగులు కళ్లు మిరుమిట్లు గొలిపే సెట్టింగులు.. రంగురంగుల విద్యుత్ దీపకాంతులు..ఆత్మీయతల పరిమళాలు. ఈ సందడి రానే వచ్చింది. ఈ సారి ఏడాది పొడవునా పెళ్లి బాజాలు మోగనున్నాయి. కొత్త సంవత్సరంలో శుభ ముహూర్తాలు అధికంగా ఉండటంతో కల్యాణ మండపాలు కళకళలాడనున్నాయి.



మోగనున్న పెళ్లి బాజా

- నేటి నుంచి శుభ ముహూర్తాలు
- ఒక్కటి కానున్న వందలాది జంటలు
- కళకళలాడనున్న కల్యాణ మండపాలు

కొలిమిగుండ్ల: శుభకృతనామ సంవత్సరం కావడంతో శుభాలు కలగనున్నాయి. ఈ ఏడాదిలో నేటి నుంచి పెళ్లి ముహూర్తాలు ప్రారంభం కానున్నాయి. కొద్ది రోజుల నుంచి మంచి ముహూర్తాలు లేక గ్రామాలు, పట్టణాల్లో సందడి కనిపించడంలేదు. ఈ ప్రభావం వ్యాపారాలపై కూడా పడింది. ఇప్పటి నుంచి వివాహాలతో పాటు గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలకు మంచి రోజులు ఉండటంతో మళ్లీ సందడి మొదలుకానుంది. ఏప్రిల్, జూలై మినహా మిగతా అన్ని నెలల్లో కలిపి 104 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. దీంతో వందలాది జంటలు ఒక్కటి కానున్నాయి.

ఏర్పాట్లలో బిజీ

ముహూర్తాలు మొదలు కావడంతో ఎవరి పనుల్లో వారు బిజీ అయ్యారు. పెళ్లి పత్రికలు అచ్చు వేయడం మొదలు కొని కల్యాణ మండపాలు బుకింగ్, వంట మనుషులు, పురోహితులు, నాయీ బ్రాహ్మణులు, డెకరేషన్, పూలు, ఫొటోగ్రాఫర్స్, జీపులు, బస్సులు ఇలా ప్రతిదీ ముందస్తుగానే బుక్ చేసుకుంటున్నారు. బంగారం, బట్టల దుకాణాలకు కళ వచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని యాగంటి, మహానంది, శ్రీశైలం, మంత్రాలయం తదితర పుణ్యక్షేత్రాల వద్ద గదులు, ఫంక్షన్ హాళ్లను నిర్వాహకులు ముందుగానే రిజర్వ్ చేసుకున్నారు. మరికొందరు బంధువులు, సన్నిహితులను ఆహ్వానించే పనిలో నిమగ్నమయ్యారు. పట్టణాల తరహాలో గ్రామాల్లో సైతం ఇళ్ల నిర్మాణాలను అందంగా ఆకర్షణీయంగా ఒకరికొకరు పోటీ పడి నిర్మించుకుంటున్నారు. ముహూర్తాలు ఉండటంతో ఈసారి గృహ ప్రవేశాలు కూడా భారీగా జరుగనున్నాయి. ఇదిలా ఉంటే ఈ ఏడాది అధిక సంఖ్యలో వివాహాలు జరుగనుండటంతో ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కల్యాణ మస్తు, వైఎస్సార్ తోఫా పథకాల ద్వారా చాలా మంది జంటలకు లబ్ధి చేకూరనుంది.

పెళ్లిళ్ల పేరయ్యలకు గిరాకీ

ఈ ఏడాదిలో వందకు పైగా ముహూర్తాలు ఉండటంతో పెళ్లిళ్ల పేరయ్యలకు గిరాకీ పెరిగింది. ప్రస్తుతం పెళ్లి చేసుకునేందుకు చాలా మంది వారిపైనే ఆధారపడుతున్నారు. అన్ని సామాజిక వర్గాల్లో అమ్మాయిలకు డిమాండ్ పెరిగింది. అబ్బాయిలకు అందం, డబ్బు, ఉద్యోగం, హోదా ఉన్న మ్యాచింగ్ కుదరడం లేదు. చాలా మందికి అన్ని రకాల వనరులున్నా పదుల సంఖ్యలో పెళ్లి చూపులు చూస్తున్నా సెట్ కావడం లేదు. దీంతో పెళ్లిళ్ల పేరయ్యల అవసరం పెరిగింది. కొందరు అమ్మాయిలకే ఎదురు కట్నం ఇచ్చి చేసుకుంటుండగా మరికొందరు పొరుగు రాష్ట్రాల్లోని యువతులను వివాహమాడుతున్నారు.

ముహూర్తాలు బాగున్నాయి



ఈఏడాది పెళ్లి ముహూర్తాలు బాగున్నాయి. పైగా శుభకృత నామ సంవత్సరం రావడంతో ఏప్రిల్, జూలై నెలలు మినహా మిగతా పది నెలలు మంచి ముహూర్తాలు ఉన్నాయి. పెళ్లిళ్లతో పాటు గృహప్రవేశాలు తదితర శుభకార్యాలకు ఈ సంవత్సరం చాలా అనుకూలం. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఏడాది పొడవునా వివాహాలు జరుగుతాయి.

–ఆలూరి రాఘవేంద్రప్రసాద్, వేదపండితులు, కొలిమిగుండ్ల

ఈ ఏడాదిలో మంచి ముహూర్తాలు	
జనవరి :	25, 26, 27, 28 తేదీలు
ఫిబ్రవరి:	1, 8, 9, 10, 11, 12, 15, 16, 22, 23, 24, 25
మార్చి:	1, 5, 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 26
మే:	3, 4, 5, 6, 7, 8, 10, 11, 12, 13, 21, 26, 27, 28, 30, 31
జూన్:	1, 3, 7, 8, 9, 10, 11
ఆగస్టు :	19, 20, 22, 24, 26, 29, 30, 31
సెప్టెంబర్:	1, 2, 3, 6, 7, 8
అక్టోబర్:	18, 19, 20, 21, 22, 24, 25, 26, 27, 31
నవంబర్:	1, 2, 8, 9, 16, 17, 18, 19, 22, 23, 24, 25, 28, 29
డిసెంబర్:	3, 5, 6, 7, 8, 14, 15, 16, 17, 19, 20, 21, 24, 31 తేదీలు

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకుకు గాయాలు

వెల్దుర్తి: పెళ్లి పత్రికలు పంచేందుకు వెళ్తుండగా కారు ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పట్టణ సమీపంలోని చెరుకులపాడు క్రాస్ వద్ద హైవే 44పై మంగళవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. కోడుమూరు పట్టణానికి చెందిన బోయ మద్దిలేటి తన పెద్దకుమారుడికి పెళ్లి నిశ్చయించాడు. చెరుకుల పాడులోని బంధువులకు పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు చిన్న కుమారుడు హరిశ్చంద్రప్రసాద్‌తో కలిసి బైక్‌పై బయలుదేరాడు. చెరుకులపాడు క్రాస్ వద్ద యూటర్న్ తీసుకుంటుండంగా వెనుక నుంచి కారు వచ్చి ఢీకొంది. ఈఘటనలో గాయపడిన తండ్రి, కొడుకును స్థానికులు 108లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసుల ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాద స్థలంలో పెళ్లి పత్రికలు, రూ.లక్ష నగదు పడి ఉండగా తీసుకెళ్లి బాధితులకు అందజేశారు. రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం


మృతిచెందిన అభిషేక్

ఆలూరు రూరల్: మండల పరిధిలోని మనేకుర్తి గ్రామం వద్ద నేషనల్ హైవే 167లో లారీ ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా డిసూగుర్ గ్రామానికి చెందిన బిందు, రాజేష్ దంపతుల కుమారుడు అభిషేక్ (23) రాయచూర్ నుంచి పని నిమిత్తం స్కూటర్‌పై బళ్లారికి వెళ్తున్నాడు. ఆలూరు నుంచి ఆదోని వైపు వెళ్తున్న లారీ ఏపీ 02 టీఈ 2170 ఎదురుగా వచ్చి బలంగా ఢీ కొంది. ప్రమాదంలో అభిషేక్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మృతదేహాన్ని ఆలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు బెంగళూరులోని దయానంద ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాయక్ తెలిపారు.

15లోగా డీఈఎల్ఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

కర్నూలు కల్చరల్: డీఈఎల్ఈడీ పరీక్షల ఫీజును ఫిబ్రవరి 15వ తేదీలోగా చెల్లించాలని డీఈఓ వి.రంగారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 2015-17 బ్యాచ్ నుంచి 2018-20 బ్యాచ్ వరకు స్పాట్, మేనేజ్‌మెంట్ అడ్మిషన్లు పొందిన అభ్యర్థులకు రానున్న ఏప్రిల్/మే నెలల్లో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గతంలో ఫెయిల్ అయిన అభ్యర్థులు ప్రైవేట్‌గా హాజరయ్యేందుకు అర్హులని తెలిపారు. నాలుగు సబ్జెక్టులకు రూ.150, మూడు సబ్జెక్టులకు రూ.140, రెండు సబ్జెక్టులకు రూ.120, ఒక్క సబ్జెక్టుకు రూ.100 ఫీజు చెల్లించాలని సూచించారు. రూ.50 ఫైన్‌తో ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఫీజు చెల్లించొచ్చని తెలిపారు.

ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలు వేలం

కర్నూలు: పొరుగు రాష్ట్రాల మద్యం, నాటుసారా, ఇసుక అక్రమ రవాణాలో పట్టుబడిన వాహనాలను ఈనెల 28వ తేదీన వేలం వేయనున్నట్లు కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ సత్యనారాయణ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచినవారు 28వ తేదీ ఉదయం 10 గంటలకు కర్నూలు సెబ్‌స్టేషన్‌లో రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సీఐ పేర్కొన్నారు.

2 నుంచి ఏక పాత్రాభినయం పోటీలు

కర్నూలు కల్చరల్: ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరి 2,3 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఏక పాత్రాభినయం, పాటల పోటీలను నిర్వహిస్తున్నట్లు హనుమాన్ కళా సమితి అధ్యక్షుడు హనుమంతరావు చౌదరి తెలిపారు. మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో రెండు విభాగాల్లో పోటీలు ఉంటాయని, పాల్గొనే వారు 1వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు.

ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బులు వసూలు చేయొద్దు

కర్నూలు(హాస్పిటల్) : ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే సంబంధిత ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆరోగ్యశ్రీ అమలుపై సంబంధిత వైద్యాధికారులు, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. అయినప్పటికీ జిల్లాలో ఉన్న తొమ్మిది ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఆయన పేర్కొన్నారు. డబ్బు వసూలు చేసే ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రాంజీ నాయక్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ రఘు, ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు పాల్గొన్నారు.

రాత్రి గస్తీకి ప్రత్యేక పోలీసు బృందాలు

కర్నూలు: నగరాన్ని సేఫ్ సిటీగా మార్చేందుకు రాత్రి గస్తీకి 22 వాహనాలతో ప్రత్యేక పోలీసు బృందాలను నియమించినట్లు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడమే కాక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కర్నూలు నగర ప్రజలకు ఎక్కడ సమస్యలున్నా (కాలనీలు, వీధులు, పరిసర ప్రాంతాలు) పోలీస్ పెట్రోలింగ్ కోసం కర్నూలు పోలీస్ వెబ్‌సైట్‌లో http:// kurnoolpolice. in/ safecity లింక్‌ను క్లిక్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. రోజూ పోలీసులు రాత్రి 7 నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు రాత్రి గస్తీ నిర్వహిస్తారన్నారు. పోలీస్ వెబ్‌సైట్ ప్రారంభించిన అనతి కాలంలోనే 79 మంది ఫిర్యాదులు నమోదు చేసి వెబ్‌సైట్ ద్వారా లబ్ధి పొందారని ఎస్పీ తెలిపారు.

ఆర్‌బీకేల్లో విజిలెన్స్ తనిఖీలు

కర్నూలు: కర్నూలు, నంద్యాల జిల్లాలోని ఆర్‌బీకే సెంటర్లలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ శంకబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు కర్నూలు ప్రాంతీయ అధికారి తిరుమలేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్ బృందాలు మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. సబ్సిడీ విత్తనాల నాణ్యత, రైతుల ఈ-క్రాప్ బుకింగ్ ఇన్సూరెన్స్ అందిన తీరు, తదితర అంశాలపై ఆరా తీశారు. తనిఖీల్లో సీఐలు కేశవరెడ్డి, శ్రీధర్, డీఈ గుణకర్ రెడ్డి, ఏఏఓ షణ్ముఖ గణేష్, ఎఫ్ఆర్వో ఖాన్, ఏజీ సిద్దయ్య, ఎస్ఐ నగేష్, ఏఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కర్నూలు జిల్లాలోని వెల్దుర్తి వైఎస్సార్ రైతుభరోసా కేంద్రం, నంద్యాల జిల్లా పాణ్యం మండలం బల్వనూరు, నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు డాక్టర్ వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

బాలికా విద్యకు ప్రాధాన్యత

- జిల్లా కలెక్టర్ సతీమణి స్వర్ణలత
- ఘనంగా జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు


ప్రశంసా పత్రాలు అందుకున్న ఎన్‌సీసీ కేడెట్లతో కలెక్టర్ సతీమణి, ఇతర మహిళా అధికారిణులు

కర్నూలు(అర్బన్): బాలికా విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు సతీమణి స్వర్ణలత అన్నారు. బేటీ బచావో, బేటీ పడావో వారోత్సవాల్లో భాగంగా జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు అభివృద్ధి చెందడమే కాకుండా తమ చుట్టూ ఉన్న వారిని కూడా అభివృద్ధి చేసే స్థాయికి ఎదగాలన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుకియాబేగమ్, ఐసీడీఎస్ పీడీ కేఎల్ ఆర్‌కే కుమారి మాట్లాడుతూ దేశంలో రోజుకు రోజుకు తగ్గిపోతున్న బాలికల నిష్పత్తిని పెంచేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం వెయ్యి మంది బాలలకు 918 మంది బాలికలు ఉన్నారన్నారు. దిశ ఎస్ఐ దానమ్మ మాట్లాడుతూ మహిళలందరూ దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా కళాజాత బృందం బాలిక విద్య తదితర కార్యక్రమాలపై ప్రదర్శన ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలు, విద్య, ఆటలు, డ్రాయింగ్, పెయింటింగ్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన బాలికలను సన్మానించారు. అలాగే వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఎన్‌సీసీ కేడెట్లకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎస్. మహబూబ్‌బాషా, జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ, ఎల్‌సీసీ కమిటీ మెంబర్ మాధవీశ్యామల, డాక్టర్ లలిత, జువైనల్ వెల్ఫేర్ పర్యవేక్షణ అధికారి భాస్కర్, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డీడీఓలకు అవగాహన అవసరం



టీడీఎస్ డిడక్షన్‌పై అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

కర్నూలు(సెంట్రల్): ట్యాక్స్ డిడక్షన్స్‌పై డీడీఓ (డ్రాయింగ్ డ్రాఫ్ట్ ఆఫీసర్)లకు అవగాహన అవసరమని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు అన్నారు. టీడీఎస్ డిడక్షన్స్‌ను మదింపు చేయు సమయంలో తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పాటించాలన్నారు. లేని పక్షంలో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన డీడీఓలకు ఇంకమ్ ట్యాక్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగస్తులు ఎవరికి వారు సొంతంగా టీడీఎస్ డిడక్షన్‌లను చేసే విధంగా తయారు కావాలన్నారు. ట్రెజరీ డీడీ రామచంద్రరావు మాట్లాడుతూ..టీడీఎస్ డిడక్షన్లపై అవగాహన ఉంటే తప్పులు జరగవన్నారు. అనంతరం తిరుపతికి చెందిన ఇంకమ్ ట్యాక్స్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర్ డీడీఓలకు అవగాహన కల్పించారు. ఉద్యోగుల సలహాలు, సందేహాలను ఆయన తీర్చారు. నిబంధనలను విశదికరించడంతో శిక్షణ ఎంతోఉపయోగపడింది. కార్యక్రమంలో కర్నూలు ఇంకమ్ ట్యాక్స్ ఆఫీసర్‌కేవీ రంగారావు, కలెక్టర్ కార్యాలయ ఏఓ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

నేను కచ్చితంగా ఓటేస్తా..

- నేడు జాతీయ ఓటరు దినోత్సవం
- కొత్త ఓటర్లు ఎప్పుడైనా నమోదు చేసుకోవచ్చు
- జిల్లాలో యువ ఓటర్లు 9,48,980
- నూరేళ్లు నిండిన ఓటర్ల సంఖ్య 808



కర్నూలు(సెంట్రల్): ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే నిర్ణేతలు. వారి మనోభావాలను ప్రకటించేందుకు ప్రజల చేతిలో ఉన్న ఏకైక పదునైన ఆయుధం ఓటు. ప్రజల గళం వినిపించాలన్నా.. ప్రజాస్వామ్య వ్యవస్థ పదిలంగా ఉండాలన్నా.. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై, ఓటు హక్కు వినియోగించుకోవాలి. వజ్రాయుధం లాంటి ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎన్నికల సంఘం ఏటా జనవరి 25న 'జాతీయ ఓటరు దినోత్సవాన్ని' నిర్వహిస్తోంది. ఈ ఏడాది కూడా 'నేను కచ్చితంగా ఓటేస్తా' అనే యువ నినాదంతో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కర్నూలు జిల్లాలో మొత్తం 19,40,628 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో ఇందులో పురుషులు 9,65,685 మంది, స్త్రీలు 9,74,649 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో మహిళల ఓటర్లసంఖ్య 8,964 ఎక్కువగా ఉంది. అలాగే నూరేళ్లు దాటిన ఓటర్లు 808 మంది ఉన్నారు. 90-99 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లు 4,397 మంది ఉన్నారు. 80-89 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లసంఖ్య 28,267గా ఉంది. ఇక అత్యధికంగా జాబితాలో యువ ఓటర్లు ఉన్నారు. 18 నుంచి 39 ఏళ్ల మధ్య ఏకంగా 9,48,980 మంది ఓటర్లు ఉన్నారు. ఓటరు జాబితాలో దాదాపు సగానికిపైగా యువతే ఉండడం ప్రజాస్వామ్యానికి ఎంతో బలం.

365 రోజుల పాటు నమోదుకు అవకాశం

భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పించింది. దీంతో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి. గతంలో జనవరి 1వ తేదీ నాటికీ మాత్రమే 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు ఇచ్చేవారు. ఈ ఏడాది నుంచి సంవత్సరంలో ఎప్పుడు 18 ఏళ్లు నిండిన అదే సమయం నుంచి ఓటును ఏపీ సీఈఓ సైట్ ద్వారా 365 రోజులపాటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఏటా అక్టోబర్ - జనవరి మధ్యలో ఓటరు నమోదు సవరణ జాబితాను సిద్ధం చేస్తారు. అందులో 18 ఏళ్లు నిండి భారతీయులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు నమోదు చేసుకోవచ్చు. భారతదేశ పౌరసత్వం కలిగి ఉండి విదేశాల్లో ఉండే వారు కూడా తగిన ఆధారాలు చూపి ఓటరుగా నమోదు కావచ్చు. కాగా, ఇప్పటి వరకు ఏటా ఒక్కసారి మాత్రమే ఓటరు సవరణ జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించేంది. ఈ ఏడాది నుంచి ఎప్పుడు 18 ఏళ్లు వచ్చిన ఓటును నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు	
వయస్సు (సంవత్సరాలు)	ఓటర్ల సంఖ్య
18-19	13,474
20-29	3,69,134
30-39	5,66,372
40-49	4,40,799
50-59	2,85,976
60-69	1,74,172
70-79	93,229
80-89	28,267
90-99	4,397
100+	808

నేడు యువ, వృద్ధ ఓటర్లకు సన్మానం..

జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి వరకు ప్రజలకు అవగాహన కోసం ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపడుతున్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జరిగే కార్యక్రమానికి కలెక్టర్, జేసీతోపాటు ఇతర ఉన్నతాధికారులు హాజరవుతారు. ఇదే కార్యక్రమంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తారు. అంతేకాక కొత్తగా ఓటు నమోదు చేసుకున్న ఐదుగురు యువకులకు, ఐదుగురు అత్యంత సీనియర్ ఓటర్లకు సన్మానం చేయనున్నారు.